ఆదివారం
26 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:100
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal


# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)


అవన్నీ కల్పితాలే..
వస్త్రధారణ పాలసీపై ఇండిగో




# నేరుగా చర్చలుండవ్!

### ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చి పాక్ ప్రధాని షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్‌తో ముగిసిన భేటీ



వాషింగ్టన్/ టెహ్రాన్, ఏప్రిల్ 25: అమెరికా ఇరాన్ మధ్య జరగాల్సిన రెండోవిడత శాంతిచర్చల అంశంపై అనిశ్చితి కొనసాగుతూనేఉంది. అమెరికా బృందంతో నేరుగా చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఇరాన్ తెగేసి చెబుతున్నది. తమ అభిప్రాయం ఏదైనా పాకిస్థాన్ ద్వారానే ప్రకటిస్తామని ప్రకటించింది. ఇలాంటి సందర్భంలో శనివారం ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి తన బృందంతో కలిసి ఇస్లామాబాద్‌లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇరాన్ బృందం కేవలం ప్రాంతీయ

వివరాలు 2లో..

# సుపరిపాలన అందిస్తున్నాం...

### -దేశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశా ‘బెస్ట్ రిఫార్మర్’ అవార్డు అందుకున్న అనంతరం చంద్రబాబు



అమరావతి : స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాల ద్వారా రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. ‘టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్’ అవార్డుకు ఎంపికైన చంద్రబాబు కేంద్రఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదగా శనివారం ముంబయిలో ఈ అవార్డును అందుకు న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో సంస్కరణలకు ముందు తర్వాత దేశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లు చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని అన్నారు. మోడీ రూపొం దించిన వికసితభారత్-2047లో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ, బ్యాటరీ, పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ అమ్మోనియా వంటి రంగాల్లో ఇప్పుడు విద్యుత్ ఉత్పత్తి కావాలని చెప్పారు. అప్పుడే ఇంధన రంగంలో భారత్ అగ్రస్థానంలో ఉంటుందన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం ద్వారా దేశానికి టెక్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేశా మన్నారు. ఫ్యూచర్‌సిటీగా గ్రీన్, బ్లూ సిటీ, నెట్ జీరో

వివరాలు 2లో..

# ఇంఫాల్‌లో ఉద్రిక్తత

### సీఎం నివాసం ముట్టడికి ఆందోళనకారుల యత్నం వారికి, పోలీసుల మధ్య తోపులాట



# ‘ఆప్’ అల్లకల్లోలం

### రాఘవ్ చడ్డా బాటలోనే మరో ఆరుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీ గూటిలో చేరిక.. కేజ్రీవాల్‌కు బిగ్‌షాక్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఎంపీ రాఘవ్ చడ్డా సహా ఆప్ ముఖ్యనేతలు అశోక్ మిత్తల్, సందీ ప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ, స్వాతి మాలీవాల్ ఆప్‌కి రాజీనామా చేయడంతో పార్టీ భారీ కుదుపులకు గురైంది. సరిగ్గా ఏడాది క్రితం పార్టీ అధినేత అర్వింద్ కేజ్రీవాల్‌ను ఎంతో అప్యాయతతో తన ఇంటికి ఆహ్వానించిన అశోక్‌మిత్తల్, తన బంగ్లా నుంచి వెళ్లిపోయిన కొన్నిగంటల్లోనే

వివరాలు 2లో..

# హైకోర్టుకు తొలి మహిళా సిజె



### జస్టిస్ లీసా గిల్‌తో ప్రమాణం చేయించిన గవర్నర్

అమరావతి : రాష్ట్ర హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటి వరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పనిచేశారు. ఆయన పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో జస్టిస్ లీసా గిల్ నూతన సిజెగా నియమితులయ్యారు. విజయవాడ లోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెతో గవర్నరు ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ లీసా గిల్ నవంబరు 17, 1966న చండీగఢ్‌లో జన్మించారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ హర్పాల్ సింగ్ బ్రార్ కుమార్తె ఆమె. పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి బిఎ-ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 1990లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు.

వివరాలు 2లో..

# రాష్ట్రీయ సరెండర్ సంఘ్‌గా మారిపోయింది



# రీపోలింగ్‌కు ఆదేశించలేదు : ఇసి



న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ తొలి విడత, తమిళనాడు ఎన్నికల పోలింగ్ పూర్తయిన తరువాత ఎక్కడా రీపోలింగ్‌కు ఆదేశించలేదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌లో 600 మందికిపైగా అభ్యర్థులు, తమిళనాడులో 1825 మంది అభ్యర్థులు లేదా వారి ప్రతినిదుల సమక్షంలో శుక్రవారం పరిశీలన పూర్తయిందని పేర్కొంది. పోలింగ్ కేంద్రాల రికార్డుల పరిశీలన అనంతరం ఎక్కడా రీపోలింగ్‌కు సిఫార్సు చేయలేదని తెలిపింది. ఈ మొత్తం ప్రక్రియను వీడియో తీశారని, ధ్రువీకరణ అనంతరం పత్రాలను తిరిగి సీల్ చేశారని పేర్కొంది. ఇవిఎం -- వివి ప్యాట్ యూనిట్లను స్ట్రాంగ్ రూమ్‌లలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించింది.

# నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా బిజెపి ఎమ్మెల్యే అశోక్ లాహిరి


### పశ్చిమ బెంగాల్ ఎన్నికల కోసమేనా?



న్యూఢిల్లీ : నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రస్తుత బిజెపి ఎమ్మెల్యే అశోక్ లాహిరి నియమితులయ్యారు. ఆయనతో పాటు నీతి ఆయోగ్ సభ్యులుగా గత ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేసి ఓటమి చెందిన గోబర్ధన్ దాస్, మాజీ కేబినేట్ సెక్రటరీ రాజీవ్ గౌబా, ప్రొఫెసర్ కెవి రాజు, ప్రొఫెసర్ అభరు కరంధేకర్, డాక్టర్ ఎం.శ్రీనివాస్‌ను నియమించారు. నీతి ఆయోగ్‌ను పునర్వ్యవస్థీకరిస్తూ కేంద్ర మంత్రివర్గ సెక్రటేరియట్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బెరీ స్థానంలో బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్ కుమార్ లాహిరి నియమితులయ్యారు. ఆయన కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా కూడా పని చేశారు. 15వ ఆర్థిక సంఘ సభ్యుడిగా పని చేశారు. ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్, ఆసియా డవలప్ మెంట్ బ్యాంక్ (ఎడిబి)ల్లో కూడా పని చేశారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ప్రెసిడెన్సీ యూనివర్శిటీలో విద్యను అభ్యసించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లోని బలుఘాట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. నీతి

వివరాలు 2లో..

# యుద్ధం తర్వాత పాలస్తీనాలో తొలిసారి ఎన్నికలు !



### -- వెస్ట్ బ్యాంక్‌లో, డేర్ అల్ బాలాష్‌లోనే పోలింగ్-- ఎన్నికల బరిలో లేని హమాస్ !

గాజా : రెండేళ్లకు పైగా గాజాలో ఇజ్రాయిల్ సాగించిన మారణహోమం తర్వాత మొదటిసారిగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పాలస్తీనియన్లు శనివారం ఓటు వేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7గంటలకు పోలింగ్ ఆరంభమైంది. ఉదయం నుండే ఓటర్లు బారులు తీరి కనిపించారు. 20ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలకు గానూ వెస్ట్‌బ్యాంక్‌లో దాదాపుగా 15లక్షలమంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మొత్తంగా గాజాలో కేవలం డేర్ ఎల్ బాలాష్ ఏరియాలో మాత్రమే ఈ ఎన్నికలను నిర్వహించారు. ఇజ్రాయిల్ సాగించిన ఊచకోత నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు వేరే ప్రాంతాలకు తరలిపోకుండా వున్నది, తక్కువ నష్టం

వివరాలు 2లో..

## సుపరిపాలన అందిస్తున్నాం...

మొదటి పేజీ తరువాయి

కాన్సెప్టుతో హైదరాబాద్ ప్లస్ నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమం కూడా కీలకమైన అంశమన్నారు. రెవెన్యూ వస్తేనే సంక్షేమం చేయగలమని చెప్పారు. పరిశ్ర మలను ప్రోత్సహిస్తేనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశం జనాభా కొరతను ఎదుర్కొంటుందని చెప్పారు. అందుకే జనాభా నిర్వహణ ప్రక్రియను చేపట్టాలనే ఉద్దేశ్యంతో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందించామన్నారు.

## 'ఆప్' అల్లకల్లోలం

మొదటి పేజీ తరువాయి

పార్టీకి రాజీనామా చేయడం గమనార్హం.రాజ్యసభలో ఆప్ ఉపనేత హోదాను రాఘవ్ ను తప్పించి, ఇటీవల కేజ్రీవాల్ ఆ హోదాను అశోక్ మిత్తల్‌కు కట్టబెట్టారు. అశోక్ మిత్తల్ ఇంతలోనే చడ్డా వెంటే బీజేపీ గూటికి చేరడం ఆప్‌నకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఇక్కడే మరో ట్విస్ట్ కూడా ఉంది. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ బెయిల్‌పై విడుదలైన తర్వా త ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.అప్పుడు సీఎం నివాసం నుంచి బయటకు వచ్చిన ఆయన్ను, మిత్తల్ తన అధికారిక నివాసంలోకి ఆహ్వానించారు. ఈనెల 24న కేజ్రీవాల్ ఆ ఇంటిని ఖాళీ చేసి తనకు ప్రభుత్వం కేటాయించిన లోధి ఎస్టేట్ బంగ్లాకు మారారు. జాతీయ పార్టీ అధినేత హోదా కింద ఆ భవనాన్ని మాజీ సీఎంకు కేటాయించారు. అలా కేజ్రీవాల్ వెళ్లిపోయిన కొన్ని గంటల్లోనే మిత్తల్ పార్టీకి రాజీనామా చేయడం గమనార్హం. ప్రస్తుతం ఆప్‌కు రాజ్యసభలో సంజయ్ సింగ్, ఎన్డీ గుప్తా, బల్బీర్ సింగ్, లోక్‌సభలో గుర్మీత్ సింగ్, రాజ్‌కుమా ర్, మహీందర్ సింగ్ మాత్రమే మిగిలారు.

### రాష్ట్రీయ సరెండర్

## సంఘ్ గా మారిపోయింది

న్యూఢిల్లీ : భారత్ -- అమెరికా సంబంధాల విషయంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్రీయ సరెండర్ సంఘ్‌గా మారిపోయిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఇరు దేశాల సంబంధాలపై బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ చేసిన ప్రకటన నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా ఎక్స్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. 'రాష్ట్రీయ సంఘ్ లొంగిపోయింది. నాగ్‌పూర్‌లో ఫర్జీ జాతీయవాదం. అమెరికాలో పచ్చి దాస్య స్వభావం. రామ్‌మాధవ్ మాత్రమే సంఘ్ నిజస్వరూపాన్ని బయటపెట్టారు' అని పేర్కొన్నారు. ఇరాన్, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించడంపై రామ్‌మాధవ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్‌గాంధీ ఈ పోస్టు చేశారు. ప్రపంచ వేదికపై భారత్ తన స్వతంత్ర స్వరాన్ని కోల్పోయిందని, ఈ లొంగుబాటుతో ప్రధానిగా కొనసాగే అర్హతను నరేంద్రమోడీ కోల్పోయారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు.

## ఇంఫాల్‌లో ఉద్రిక్తత



ఇంఫాల్, ఏప్రిల్ 25: రాష్ట్రంలో శాంతిస్థాపనతో పాటు మరో ఆరు ప్రధాన డిమాండ్లతో శనివారం మణిపూర్ సమన్వయ కమిటీ రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులు ముఖ్యమంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించారు. ఈ క్రమంలో నిరసనకారులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన తోపులాట ఘర్షణకు దారితీసిందిఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసు లు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. దీంతో కొందరు ఆందోళనకారులు అస్వస్థతకు గురయ్యారు. వారిని ప్రత్యేక అం బులెన్సుల్లో సమీప ఆస్పత్రులకు తరలించా రు. ఈనెల 7న బిష్ణుపూర్ జిల్లాలో జరిగిన రాకెట్ దాడిలో ఇద్దరు చిన్నారులు మరణించారు. అప్పటి నుంచి మణిపూర్‌లో పరిస్థితు లు నివురుగప్పిన నిప్పులా మారాయి. రాష్ట్రం లో ఎప్పుడు.. ఎక్కడ ఎలాంటి ఉద్రిక్తలు చోటుచేసుకుంటాయేమోనని రాష్ట్ర ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

# నేరుగా చర్చలుండవ్!

మొదటి పేజీ తరువాయి

పరిస్థితులపై మాత్రమే చర్చించిందని, తమ మధ్య అమెరికాతో చర్చల ప్రస్తావన రాలేదని పాక్ ప్రధాని షరీఫ్ స్పష్టం చేశారు. భేటీకి సంబంధించిన వీడియోను పాక్ ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసింది. విదేశాంగ మంత్రి ఇషాక్‌దార్, ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ చర్చల్లో పాల్గొన్నారు. భేటీలో ఇరాన్ తన డిమాండ్లతో కూడిన ప్రతిపాదనలను పాక్‌కు అందజేసింది.అమెరికన్ ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ ఇస్లామాబాద్ చేరుకోవడానికి ముందే ఇరాన్ బృందం అక్కడి నుంచి నిష్క్రమించడం గమనార్హం. మరోవైపు, అమెరికన్ బృందం మాత్రం ఎప్పుడెప్పుడు చర్చలు జరుగుతాయా.. అని ఎదురుచూస్తున్నది. ఏదేమైనా, పాక్ మాత్రం మరింత పట్టింపుతో రెండు దేశాల మధ్య సయోధ్య కుదు ర్చాలని ప్రయత్నిస్తున్నది. శాంతిచర్చలకు అన్ని విధాలుగా ఇస్లామాబాద్‌ను సిద్ధం చేస్తున్నది. ఐదురోజులుగా నగరంలో కట్టుదిట్టమై న భద్రత అమలవుతున్నది. సుమారు 10,000 మంది భద్రతా సిబ్బంది పహారా కాస్తున్నారు.హోర్ముజ్ వద్ద ప్రతిష్టంభనప్రస్తుతం హోర్ముజ్ జలసంధి వద్ద ప్రతిష్టంభన కొనసాగుతున్నది.ఇరాన్ ఎనిమిది వారాలుగా జలసంధి వద్ద ఇతర దేశాల నౌకల రాకపోకలను అడ్డుకుంటున్నది. అందుకు ప్రతిచర్యగా అమెరికా కూడా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధం విధించింది. శాంతి ఒప్పందం కుదిరే వరకు

దిగ్బంధం కొనసాగుతుందని ఇప్పటికే స్పష్టం చేసింది.ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా చమురు రవాణా భారీగా పడిపోయింది. సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఇరాన్ మంత్రులు పాకిస్థాన్, మస్కట్, మాస్కోలో పర్యటించనున్నారు. మరోవైపు, తాజాగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మాట్లాడుతూ.. జలసంధి వద్ద అమెరికా శాశ్వత దిగ్బంధం విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాల తయారీని పక్కన పెట్టే వరకూ తమ ఒత్తిడి కొనసాగుతుందని స్పష్టం చేశారు.తమ మిత్ర దేశాలకు ఇరాన్ నుంచి పొంచి ఉన్న ముప్పు ఉండకూడదనేది తమ ఆకాంక్ష అని తెలిపారు. తమ అనుమతి లేకుండా హోర్ముజ్‌లోకి ఏ రవాణా నౌక రాదని, బయటకు వెళ్లదని వెల్లడిఒచారు. జలసంధిలోని నౌకలపై దాడులు చేస్తూ. ఇరాన్ సముద్రపు దొంగల ముఠాలా ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. ఇరాన్ తన వద్ద ఉన్న యురేనియాన్ని బేషరతుగా వదులుకోవాలనీ, హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు ఆటంకం కలిగించకూడదని పునరుద్ఘాటించారుఇరాన్ నుంచి విమాన సర్వీసుల పునరుద్ధరణఅమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం మొదలైన రెండు నెలల తర్వాత ఇరాన్ శనివారం తిరిగి తన వాణిజ్య విమాన సర్వీసులను పునరుద్ధరించింది. తొలిరోజు టెహ్రాన్‌లోని ఇమామ్ ఖమేనీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇస్తాంబుల్, మస్కట్, మదీనా వంటి నగరాలకు విమానాలు నడిచాయి.

## అవన్నీ కల్పితాలే'.. వస్త్రధారణ పాలసీపై ఇండిగో

: ఇండిగో సిబ్బంది వస్త్రధారణ, వ్యక్తిగత అలంకరణ మార్గదర్శకాలకు సంబంధించినవిగా భావిస్తున్న కొన్ని పత్రాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. మంగళసూత్రం, సిందూరం వంటివాటిపై ఇండిగో ఆంక్షలు విధించిందని.. తద్వారా సిబ్బం దిపై మతపరమైన వివక్ష చూపిస్తోందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, ఈ ఆరోపణలను ఇండిగో ఖండించింది. అవన్నీ కల్పితాలేనని, తప్పుడు వార్తలను నమ్మొద్దని స్పష్టం చేసింది' 'మహిళా సిబ్బంది మంగళసూత్రం, సిందూరం ధరించొద్దు. మెహెందీ పెట్టుకోకూడదు. మతపరమైన దారాలు కట్టుకోకూడదు. అదేవిధంగా పురుష సిబ్బందికి తిలకం అనుమతి లేదు" అంటూ ఇండిగో మార్గదర్శకాల పేరిట కొన్ని పత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై నెటిజన్ల నుంచి విమర్శలు రావడం తో ఇండిగో వివరణ ఇచ్చింది. వాటిని తప్పుడు పత్రాలుగా కొట్టి పారేసింది. ధ్రువీకరించని సమాచారాన్ని పంచుకోవద్దని ప్రజలను కోరిందిఅనవసరంగా నన్ను వివాదంలోకి లాగారు: నరవణెపైల ట్లు, క్యాబిన్ సిబ్బంది కోసం తాము రూపొందించే విధానాలు ప్రపంచంలోనే ఉత్తమమైనవని.. సిబ్బంది భద్రత, శ్రేయస్సే వాటి లక్ష్యమని ఇండిగో తెలిపింది. సమ్మిళిత పని వాతావరణాన్ని సృష్టించే విషయానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. ఇటీవల లెన్స్‌కార్ట్ సైతం ఇదే తరహా వివాదంలో చిక్కుకుంది. బిందీ, తిలకం సహా ఎలాంటి అంశాలపైనా తమ సంస్థలో ఆంక్షలు లేవని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పీయూశ్ బన్సల్ స్పష్టత ఇచ్చారు

# హైకోర్టుకు తొలి మహిళా సిజె

మొదటి పేజీ తరువాయి

పంజాబ్-హర్యానా హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. దాదాపు పాతికేళ్లపాటు ప్రాక్టీస్ చేశారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ కేసుల్లో మంచి పేరు సంపాధించారు. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి చాలాకాలం పాటు ప్రభుత్వ న్యాయవాదిగా, పలు సంస్థలు, కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2014 మార్చి 31న పంజాబ్-హర్యానా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. తర్వాత శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం ముందుగానే ఆమెను రాష్ట్ర హైకోర్టుకు బదిలీ చేస్తూనే నూతన సిజె కానున్నారని ప్రకటించింది. అడ్వాన్స్ ట్రాన్స్‌ఫర్ పాలసీలో భాగంగా గత మార్చిలోనే రాష్ట్ర హైకోర్టుకు బదిలీపై వచ్చారు. 2028 నవంబరు 16 వరకూ ఆమె హైకోర్టు సిజెగా కొనసాగుతారు. ఆమె ఎన్నో సంచలన తీర్పులను వెలువరించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు హాజరయ్యారు.

ఇదిలా ఉండగా.. ప్రమాణ స్వీకారానికి ముందే ఆమెను సిఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా సమావేశమై పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారుసిజె జస్టిస్ ఠాకూర్‌కు వీడ్కోలఇప్పటి వరకు సిజెగా పనిచేసిన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. నూతన సిజె జస్టిస్ లీసా గిల్ ప్రసంగిస్తూ, కోర్టుల్లో మౌలిక వసతుల కోసం జస్టిస్ ఠాకూర్ కృషి చేశారని కొనియాడారు. జడ్జిల నివాస సముదాయాలు, కోర్టు భవనాల నిర్మాణాలు కూడా ఆయన హయాంలో ప్రారంభమయ్యాయన్నారు. జ్యుడీషియల్ అకాడమీకి కూడా శంకుస్థాపన జరిగిందన్నారు. చీఫ్ జస్టిస్ ఠాకూర్ భావోద్వేగంతో ప్రసంగించారు. సత్వర న్యాయం అందించాల్సి వుందన్నారు. జస్టిస్ సిటీ ప్రతిపాదన కార్యరూపంలో పెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అనంతరం హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను సన్మానించారు.

## నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా బిజెపి ఎమ్మెల్యే అశోక్ లాహిరి

మొదటి పేజీ తరువాయి

ఆయోగ్ సభ్యులకు ప్రధానమంత్రి, నీతి ఆయోగ్ చైర్మన్ నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. నీతి ఆయోగ్‌కు మరింత పదును పెట్టాలని, ఫలవంతంగా, ప్రభావవంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.ప్రణాళిక సంఘం మార్పులో కీలక మార్పు : అశోక్ కుమార్ లాహిరిశనివారం బాధ్యతలు స్వీకరించిన నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్ లాహిరి, సభ్యుడు గోబర్ధన్ దాస్ ప్రధాని మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అశోక్ కుమార్ లాహిరి మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగిం చడంపై ప్రధానికి కృతజ్ఞతలు తెలిపానని చెప్పారు. 'డేటా ఆధారిత ప్రణాళిక'పై మరింత దృష్టి సారించాల్సి ఉందని పేర్కొన్నారు.' వికసిత్ భారత్' సులభమైన విషయం కాదువికసిత్ భారత్ దార్శనికత కేవలం ఆదాయం, తలసరి ఆదాయానికే పరిమితం కాదని, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, సాధారణ సంక్షేమానికి కూడా సంబంధించినదని అశోక్ లాహిరి తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల కోసమే...నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, సభ్యుల నియామకాలన్నీ పూర్తయ్యాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ నియామకాలను పశ్చిమబెంగాల్ ఎన్నికల కోసమే అని చర్చ జరుగుతోంది. పశ్చిమ బెంగాల్ రెండో విడత పోలింగ్ 142 స్థానాలకు ఈ నెల 29న జరగనుంది. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, సభ్యుల నియామకాల్లో పశ్చిమ బెంగాల్‌కు పెద్ద పీట వేశారు. తద్వారా ఓట్లను రాబట్టుకోవచ్చని బిజెపి యోచిస్తోంది. నీతి ఆయోగ్ లో కీలకమైన వైస్ చైర్మన్ తోపాటు, ఒక సభ్యుడిని పశ్చిమ బెంగాల్‌కు కుమార్ లాహిరి, సభ్యుడు గోబర్ధన్ దాస్ పశ్చిమ బెంగాల్‌కు చెందినవారే. లాహరి ప్రస్తుత బిజెపి ఎమ్మెల్యేగా ఉండగా, దాస్ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు.

# యుద్ధం తర్వాత పాలస్తీనాలో తొలిసారి ఎన్నికలు !

మొదటి పేజీ తరువాయి

జరిగిందీ ఈ ప్రాంతంలోనే, అందువల్లే ఈ ప్రాంతంలోనే ఎన్నికలను ప్రయోగాత్మకంగా చేపట్టాలని భావించారు. ఇక్కడ దాదాపు 70వేల మంది ఓటర్లుగా నమోదయ్యారని రమల్లా కేంద్రంగా పనిచేసే కేంద్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. వెస్ట్ బ్యాంక్‌లో పోలింగ్ రాత్రి 7గంటలకు ముగిసింది. దేర్ అల్ బాలాహ్ ఏరియాలో సాయంత్రం 5గంటలకే ముగిసింది. యుద్ధం కారణంగా విద్యుత్ వ్యవస్థ విధ్వంసం కావడంతో పగటిపూటే ఓట్ల లెక్కింపు పూర్తి కావడానికి వీలుగా ముందుగానే ఓటింగ్ ముగిస్తున్నారు. ఈ ఎన్నికల నిర్వహణా ప్రక్రియను లేదా ఇతర సమాచారాన్ని అటు ఇజ్రాయిల్‌తో లేదా హమాస్‌తో ఎన్నికల కమిషన్ సమన్వయం చేసుకోలేదని కమిషన్ ప్రతినిధి ఫరీద్ తమల్లా తెలిపారు. యుద్ధానంతర కాలంలో ఎలాంటి ఒపీనియన్ పోల్స్ లేనందున ప్రయోగాత్మకంగా దేర్ అల్ బాలాహ్‌లో మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని పాలస్తీనా అథారిటీ భావించిందని రాజకీయ విశ్లేషకుడు జమాల్ అల్ ఫది వ్యాఖ్యానించారు.ఎన్నికల బరిలో లేని హమాస్ఎన్నికల అనంతరం కొత్త పాలస్తీనా సంస్థ బాధ్యతలు చేపట్టిన తర్వాత గాజా ప్రభుత్వాన్ని రద్దు చేస్తామని హమాస్ ప్రకటించింది. పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ సెక్యులర్ నేషనలిస్ట్ ఫతాహ్ పార్టీకి చెందిన అభ్యర్థులే ప్రధానంగా ఎన్నికల బరిలో వున్నారు. మరికొంతమంది ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారు. గాజా స్ట్రిప్‌లో సగానికి పైగా ప్రాంతాన్ని నియంత్రిస్తున్న హమాస్ (ఫతాహ్ ప్రత్యర్థి) తరపున అభ్యర్థులెవరూ బరిలో లేరు. చాలా నగరాల్లో ఫతాహ్ అభ్యర్థులు నేరుగా ఇండిపెండెంట్లతో పోటీ పడుతున్నారు. పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా (మార్క్సిస్ట్ -- లెనినిస్ట్) వంటి సంస్థల అభ్యర్థులు ఈ ఇండిపెండెంట్ల జాబితాలో వున్నారు. 15ఏళ్లలో మొదటిసారిగా పాలస్తీనా ఎన్నికల నిర్వహణకు అబ్బాస్ ఆదేశాలు జారీ చేశారు. పాలస్తీనా ఎన్నికల వాయిదా ఆలోచననే హమాస్ తిరస్కరించిందిమార్పు వస్తుందనుకోవడం లేదఅర్థవంతమైన మార్పులు వుంటాయని నమ్మకం లేకపోయినా చిన్నపాటి ఆశతో తాము ఓటు వేయాలనుకుంటున్నట్లు కొంతమంది ఓటర్లు చెప్పారు. ఏ పార్టీకి చెందిన వారైనా లేదా ఇండిపెండెంట్లయినా ఎవరికీ, ఏ నగరానికి ఎలాంటి మార్పు వుంటుందని తాము అనుకోవడం లేదని ఒక వ్యాపారి వ్యాఖ్యానించారు. తుల్కారెమ్‌ను పాలిస్తున్నది ఆ ఆక్రమణదారే (ఇజ్రాయిల్)ఐక్యరాజ్య సమితి ప్రశంసలవిశ్వసనీయమైన ప్రక్రియను నిర్వహిస్తున్నందుకు ఎన్నికల కమిషన్‌ను సవాళ్లతో కూడిన ఇటువంటి పరిస్థితుల్లో తమ ప్రజాస్వామ్య హక్కులను ఉపయోగించుకునేందుకు పాలస్తీనియన్లకు ఈ ఎన్నికలు మంచి అవకాశం. అని అల్కరబొవ్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు.

## 29న అసంతృప్తి అర్జీదారులతో ముఖాముఖి

### జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 25 : రెవిన్యూ సమస్యల పరిష్కారంలో అసంతృప్తి అర్జీదారులతో ఈ నెల 29న ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్టు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 29వ తేదీ ఉదయం 10.00 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని రెవిన్యూ క్లినిక్ లో ముఖాముఖి కార్యక్రమం జరగనుందని అన్నారు. ఇందులో బాగంగా పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు, రెవిన్యూ సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ ముఖాముఖి కార్యక్రమానికి విచ్చేసే అర్జీదారులు గతంలో సమర్పించిన గ్రీవెన్స్ రసీదు, దానిపై తహశీల్దారు, సబ్ కలెక్టర్ జారీచేసిన ఎండార్స్ మెంట్ కాపీని తమతో పాటు తప్పక తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

### జిల్లాలో మే 1 నుంచి

## జనగణన ప్రారంభం

### జిల్లా కలెక్టర్ డా ఎన్. ప్రభాకర రెడ్డి

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 25: జిల్లాలోని 15 మండలాలు మరియు 3 మున్సిపాలిటీలు కలిపి మొత్తం 18 చోట్ల జనగణన ప్రక్రియ నిర్వహించబడుతుంది. ఈ బృహత్తర కార్యక్రమం కోసం జిల్లా వ్యాప్తంగా 1,744 మంది ఎన్యుమరేటర్లను మరియు 302 మంది సూపర్‌వైజర్లను ప్రభుత్వం నియమించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా ఎన్. ప్రభాకర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. మే 1 నుండి మే 30 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరిస్తారు. ప్రజలందరూ ఈ గణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని మరియు సెల్ఫ్ ఎన్యుమరేషన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

### పక్కాగా ఎన్నికల రోల్స్

## మ్యాపింగ్, ఫారమ్‌ల పరిశీలన

### రాజకీయ పక్షాలకు వివరాలు వెల్లడించిన డీఆర్‌ఓ కె. హేమలత



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 25: జిల్లాలో ఎన్నికల రోల్స్ మ్యాపింగ్, ఫారమ్‌ల పరిశీలన పక్కాగా జరుగుతోందని జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత పేర్కొన్నారు. జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో శనివారం ఆమె ఛాంబరులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగేందుకు రాజకీయ పార్టీలతో సమన్వయం అత్యంత కీలకమన్నారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 2002 ఎన్నికల రోల్ డేటాను 2025 డేటాతో బూత్ లెవల్ అధికారి (బీూా) యాప్‌లో మ్యాపింగ్ చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని వివరించారు. జిల్లాలో 68.53 శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. గతేడాది జనవరి 6వ తేదీ నుంచి ఇప్పటివరకు 16,799 దరఖాస్తులను ( అన్ని రకాలు ) స్వీకరించగా, వాటిలో 273 మాత్రమే వివిధ కారణాలతో పెండింగులో ఉన్నాయన్నారు. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటు హక్కు కోసం జిల్లా వ్యాప్తంగా 7,437 దరఖాస్తులు ( ఫారం - 6 ) రాగా, అందులో 6,358 మందిని కొత్త ఓటర్లుగా చేర్చడం జరిగింది. మరో 135 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. ఓట్ల తొలగింపు కోసం వచ్చిన 2,316 దరఖాస్తుల్లో ( ఫారం - 7 ) 2,046 ఓట్లను తొలగించడం జరిగిందని, కేవలం 4 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, మిగిలినవి సక్రమంగా లేనందున తిరస్కరించినట్లు చెప్పారు. పేరు, చిరునామా లేదా ఫోటో మార్పుల కోసం 7,436 దరఖాస్తులు ( ఫారం - 8 ) రాగా, ఇప్పటికే 6,934 సవరణలు పూర్తి చేశామని తెలిపారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని కారణంగా 368 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని, 134 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల రోల్స్ సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుకుగా పాల్గొని, లోపాలు ఉన్నట్లయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని డిఆర్‌ఓ సూచించారు. ఓటర్ల జాబితాల ఖచ్చితత్వం కోసం పార్టీల సహకారం అవసరమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బీజేపీ పార్టీ ప్రతినిధులు సి.బాలాజిరావు, అల్లూరి పేర్రాజు, బి.నాగభూషణం, ఎస్.వి. మహేష్, వైసీపీ పార్టీ ప్రతినిధి వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు బి.దిలీప్ కుమార్, ఎస్.శ్రీనివాసరావు, బీఎస్పీ ప్రతినిధి టి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**రాష్ట్ర మంత్రి - కొండపల్లి శ్రీనివాస్**



ప్రజాస్వామ్యం / జామి( విజయనగరం) : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పల్లెలకు ఇప్పుడు మహర్దశ వచ్చిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జామి మండలం శాసనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మధుర సోమయాజులపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అంతకుముందు గ్రామస్తులు మంత్రికి ఘన



స్వాగతం పలికి, గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, మండల అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**"జమ్మి చెరువు వాకర్స్" ఆధ్వర్యంలో**

# స్వచ్ భారత్ కార్యక్రమం



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం భీమిలి జమ్మి చెరువు పార్క్ వద్ద "జమ్మి చెరువు అసోసియేషన్ ఆఫ్ వాకర్స్" ఆధ్వర్యంలో చతుర్ద వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పార్క్ లో స్వచ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ మరియు కార్యనిర్వహాకులలో ఒకరైన దొడ్ల శేషు కు చిరు సన్మానం చేసారు. అలాగే ఈ కార్యక్రమం ఉద్దేశించి వాకర్స్ అధ్యక్షులు యన్.జనార్ధన రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్క్ లో మొక్కలు నాటే కార్యక్రమం చెయ్యాలని, పార్క్ అభివృద్ధి మరెంతో ఆధునీకరణ పనులు జరిగేలా అధికారులతో సమీక్షించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు శంకర్ కుమార్, లక్ష్మీ నారాయణ, రవిశంకర్, దేశి రాజు, గంటా నూకరాజు, సంకురుభుక్త జోగారావు, హేమంత్ శేఖర్, సునీల్, అరవింద్, ఆనంద్, కాసరపు నాగరాజు, తాతారావు, నక్కెల్ల వెంకటరావు, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**రీ సర్వేను పారదర్శకంగా,**

# వేగవంతంగా పూర్తి చేయాలి

**జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి**




ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 25 : జిల్లాలో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దశల వారీగా చేపడుతున్న ఈ ప్రక్రియలో ఒక దశ ముగిసిన పిదపే తదుపరి దశ సర్వే చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విఆర్ఓలు, మండల మరియు గ్రామ సర్వేయర్లతో రీసర్వే పురోగతిపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. రీసర్వేలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి మరియు సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు ఈ ప్రత్యేక వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, భూ యజమానుల హక్కుల రక్షణ కోసం మూడు దశల్లో నోటీసుల సమయం, డిఎల్ఆర్ స్థాయి, ఇ-కేవైసీని తప్పనిసరి చేశామన్నారు. డ్రాఫ్ట్ ఆర్ఓఆర్ దశలో బయోమెట్రిక్ పూర్తయితే రికార్డులు లాక్ అవుతాయని, కావున ఇ-కేవైసీకి ముందే మ్యుటేషన్లు లేదా ఇతర క్లరికల్ సవరణలు ఏవైనా ఉంటే పూర్తి చేసుకోవాలని సూచించారు. 95% వరకు ఇ-కేవైసీ లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. పౌర సేవల సరళీకరణలో భాగంగా జిరాయితీ' ఖాతాల ఆమోద అధికారాన్ని ఆర్డిఓ స్థాయికి అప్పగించినట్లు జె.సి. తెలిపారు. ఇకపై కేవలం ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలు మాత్రమే జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు వస్తాయని, దీనివల్ల ప్రక్రియ వేగవంతం అవుతుందని వివరించారు. ఫీల్డ్ వెరిఫికేషన్ సమయంలో లబ్ధిదారుల ఫోటోల లభ్యత లేకపోతే, వారి ఫోన్ నంబర్ల ద్వారా వాట్సాప్ లో ఫోటోలు తెప్పించుకుని అప్‌లోడ్ చేయాలని సూచించారు. గతంలో సేకరించిన డేటాను కూడా సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియలో భాగంగా నోటీసులను గడువులోపు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి విఆర్ఓ రోజుకు కనీసం 50 ఖాతాలను పూర్తి చేసే సామర్థ్యం కలిగి ఉండాలని, కారణాలు చెప్పకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించి డేటాను అప్‌లోడ్ చేయాలని జె.సి. హెచ్చరించారు. ముఖ్యంగా మరణించిన వారి ఖాతాల విషయంలో వారసులకు బదిలీ చేసే ప్రక్రియపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, జిల్లా సర్వే,భూరికార్డుల అధికారి ఎం.శ్రీనివాసరావు, ఉప తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వే విభాగం ఉన్నతాధికారులు మరియు మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో ముమ్మరంగా వాహన తనిఖీలు

**ఎస్.ఐ - కే.కిరణ్ కుమార్ నాయుడు**

ప్రజాస్వామ్యం / గజపతినగరం: జిల్లా ఎస్పీ ఏ. ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో శనివారం నాడు వాహన తనిఖీలను చేపట్టడం జరిగిందని గజపతినగరం ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో శనివారం నాడు వాహన తనిఖీలలో భాగంగా వాహనాలను నడుపుతున్న






ఆరుగురు మైనర్లను అదుపులోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. మైనర్లకు వాహనాలను ఇచ్చిన వారి తల్లిదండ్రులను స్టేషన్కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని కిరణ్ కుమార్ నాయుడు అన్నారు. మైనర్ల తల్లిదండ్రులను కౌన్సిలింగ్ చేస్తూ మైనర్ డ్రైవింగ్ కి ఐదు వేల రూపాయలు జరిమానా విధించబడుతుంది అని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. అదేవిధంగా మైనరు కు బండి ఇస్తే బండి ఓనర్ మీద కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.

**చంద్రపాలెం హైస్కూల్ మైదానం**

# పనులు పరిశీలించిన గంటా

**3 నెలల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి తేవాలని ఆదేశం**



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి చంద్రంపాలెం హైస్కూల్ క్రీడా మైదానం పనులు పూర్తి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం ఆయన చంద్రంపాలెం హైస్కూల్ ను సందర్శించారు. మైదానం చుట్టూ నిర్మించిన డ్రెయిన్లు పరిశీలించి, వాటిలో చేరే నీరు హైస్కూల్ వెనుక ఉన్న గెడ్డలోకి మళ్లిస్తామని కాంట్రాక్టరు చెప్పారు. అయితే జీవీఎంసీ ప్రధాన డ్రెయిన్ లోకి మళ్లిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని.. సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే గంటా సూచించారు. వర్షమొస్తే హైస్కూల్ మైదానమంతా జలమయమై విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పరిష్కారానికి గంటా శ్రీనివాసరావు, ఆయన తనయుడు గంటా రవితేజ ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. హైస్కూల్ ను సందర్శించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కూడా దీన్ని మోడల్ స్కూల్ గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో సీఎస్ఆర్ కింద మైదానం పనులను దివీస్ యాజమాన్యం చేపట్టేలా ఒప్పించి.. 3 నెలల క్రితం మొదలుపెట్టారు. మైదానం చదును.. డ్రెయిన్ల నిర్మాణం.. తదితర పనులు వేగంగా జరుగుతున్నాయి. మైదానంలో సెంట్రల్ స్టేజి ప్రతిపాదన, హైస్కూల్ లో సౌకర్యాల గురించి చర్చించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణపు పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. 3 నెలల్లో పూర్తయ్యేలా బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని గంటా చెప్పారు. 2026 - 2027 విద్యా సంవత్సరం నుంచి క్రీడా మైదానం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి రెండూ విద్యార్థులకు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, నాగోతి సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, మాన్యాల సోంబాబు, గరే గుర్నాథ్, దాసరి శ్రీనివాస్, మామిడి దుర్గారావు, నాగోతి సూర్య ప్రకాష్, పిల్లా రాము, పోలిశెట్టి నాగేశ్వరరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగోతి శివాజీ, లొడగల అప్పారావు, ఈగల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ప్రతి ఒక్కరికి సురక్షిత తాగునీరే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**అట్టాడలో ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన మంత్రి - కొండపల్లి**

ప్రజాస్వామ్యం / జామి(గజపతినగరం) : గ్రామాల్లో ప్రతి ఒక్కరికి సురక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జామి మండలం అట్టాడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి శనివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు ప్రజారోగ్యానికి పెద్దపీఠ వేస్తున్నారని.. ఈ ప్లాంట్‌తో అట్టాడతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలకు శుద్ధమైన మంచినీరు అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం మంత్రి ప్లాంట్‌ను పరిశీలించి, నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





**మక్కువ మండల సీనియర్ నాయకులు డాక్టర్**

**మల్లీశ్వరరావు పరామర్శించిన మంత్రి సంధ్యారాణి**



ప్రజాస్వామ్యం/ మక్కువ ఏప్రిల్25: ఈ మధ్యకాలంలో టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ మల్లేశ్వర రావు పై దాడి చేసిన విషయం తెలుసుకొని పరామర్శించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి. మంత్రిగారు మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తులు,సూత్రధారులు ఎవరైనా , పాత్రధారులు ఎవరైనా వెలికి తీయాలని అధికారులకు ఆదేశించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను అడ్డుకునే వారిని సహించబోమని హెచ్చరికఅభివృద్ధి పనులు ఆపిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసులకు మంత్రి ఆదేశం. మక్కువ గ్రామంలో జరుగుతున్న రోడ్ నిర్మాణ పనులను దగ్గరుండి పరిశీలించిన మంత్రి సంధ్యారాణి. ఈ కార్యక్రమంలో మక్కువ మండలం పార్టీ ప్రెసిడెంట్ గుల్ల వేణు గోపాల్ నాయుడు గారు, మార్కెటింగ్ వైస్ ఛైర్మెన్ మింది సింహాచలం గారు మరియు సీరియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలిసెట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 25 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా నిర్వహణ తీరును, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇన్విజిలేటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా గదుల్లో ఫ్యాన్లు, వెలుతురు మరియు తాగునీటి సదుపాయం సరిగ్గా ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను, ఓఎంఆర్ షీట్ల భద్రతను కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మన్యం ప్రాంత విద్యార్థులు సాంకేతిక విద్యపై ఆసక్తి చూపి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షా కేంద్రం ఇన్-ఛార్జ్ మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ద్వారపూడి పోస్ట్ ఆఫీస్ ఆకస్మిక తనిఖీ

**తనిఖీ చేసిన పోస్ట్ మాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్**

ప్రజాస్వామ్యం / విజయనగరం: ద్వారపూడి బ్రాంచ్ పోస్ట్ ఆఫీసును విశాఖపట్నం పోస్ట్ మాస్టర్ జనరల్ వి. ఎస్. జయ శంకర్ శుక్రవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా ఆయన ముందుగా ఆఫీసు పరిసరాలను పరిశీలించారు. ఆఫీసు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పోస్ట్ ఆఫీసుకు వచ్చే ప్రజలతో సిబ్బంది మమేకమై సేవలను అందజేయాలని కోరారు. పోస్ట్ ఆఫీసు ద్వారా అందుతున్న సేవలను ఇంటింటికి చేరువ చేయాలని జయశంకర్ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు విజయనగరం డివిజన్ సూపరింటెండెంట్ కె. శ్రీనివాసు,సహాయ సూపరింటెం




డెంట్ జి.వి.రమణారావు, పి.సుందర్ నాయుడు,ఇన్స్పెక్టర్ ఉపేంద్ర తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# డివైడర్ ను ఢీ కొని ఇద్దరు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు దుర్మరణం



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం శనివారం ఉదయం భీమిలి బీచ్ రోడ్డులోని ఎర్రమట్టి దిబ్బలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయల్ ఎన్ఫీల్డ్ పై అతివేగంగా విశాఖపట్నం నుండి భీమిలి వస్తున్న ఇద్దరు యువకులు గంగిరి కుషాల్ కుమార్ (32), షేక్ తౌసీఫ్ (27) రోడ్డు డివైడర్ ను ఢీ కొని దుర్మరణం చెందారు. ఇద్దరికి హెల్మెట్ లేకపోవడం తో తలకు తీవ్ర గాయాలతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న భీమిలి పోలీసులు మృతదేహాలను పంచనామా నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం విశాఖపట్నం లోని టెక్ మహీంద్రా లో మేనేజర్ గా పనిచేస్తున్న గంగిరి కుషాల్ కుమార్ (32) శుక్రవారం విధులు ముగించుకుని గోపాలపట్నం లోని ఇంటికి చేరాడు. శనివారం వీక్లీ ఆఫ్ ఉండటం తో స్నేహితులను కలవడానికి అదేరోజు రాత్రి 9.30 కు విశాఖపట్నం లోని ఇంటి నుండి రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ పై బయలుదేరాడు. శనివారం ఉదయం సుమారు 7 గంటల సమీపంలో ఈ దుర్ఘటన జరగడం తో ఇరు కుటుంబాలలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుషాల్ తండ్రి సోమశేఖర్ పిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# ‘స్పిరిట్’ కి పెద్ద చిక్కు వచ్చి పడిందే..!

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో రూపొందుతున్న ‘స్పిరిట్’ సినిమా షూటింగ్ ప్రారంభం అయింది. అయితే ప్రభాస్ వరుస బిజీ షెడ్యూల్స్ కారణంగా స్పిరిట్ సినిమాకు బల్క్ డేట్లు ఇవ్వలేక పోతున్నాడట. మే నెలలో లేదా జూన్ నెలలో స్పిరిట్ కోసం డేట్లు ఇచ్చేందుకు ప్రభాస్ ఓకే చెప్పాడని తెలుస్తోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ప్రభాస్ 50 రోజులు కంటిన్యూగా డేట్లు ఇస్తే స్పిరిట్ సినిమాను పూర్తి చేసేందుకు గాను సందీప్ రెడ్డి వంగ రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ప్రభాస్ మాత్రం అన్ని సినిమాలకు మాదిరిగానే స్పిరిట్ సినిమాకు కూడా అదుగో ఇదుగో అన్నట్లుగా డేట్లు సర్దుబాటు చేయకుండా ఆలస్యం చేస్తూ వస్తున్నాడు. దాంతో ఈ ఏడాదిలో విడుదల కావాల్సిన స్పిరిట్ సినిమాను 2027 కు వాయిదా వేయడం జరిగిందని సమాచారం అందుతోందిప్రభాస్ స్పిరిట్ సినిమా రిలీజ్...ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం స్పిరిట్ సినిమాను 2027 మార్చి నెలలో విడుదల చేయాలని భావిస్తున్నారు. రంజాన్ సందర్భంగా విడుదల అయితే బాలీవుడ్ ప్రేక్షకులకు ఎక్కువగా రీచ్ అవుతుందని దర్శకుడు భావిస్తున్నాడు. స్పిరిట్ సినిమా ఓ రేంజ్ లో ఉండబోతుందని అంతా బలంగా నమ్ముతున్నారు. యానిమల్ సినిమా తర్వాత సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో సినిమా కనుక సహజంగానే బాలీవుడ్‌లో అంచనాలు భారీగా ఉంటాయి. అందుకే బాలీవుడ్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని సినిమాను 2027 మార్చిలో ఈద్ సందర్భంగా విడుదల చేయాలని ఫిక్స్ అయ్యారు. అయితే అదే ఈద్ కి బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా, తెలుగు దర్శకుడు వంశీ పైడిపల్లి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న భారీ ప్రతిష్టాత్మక మూవీని విడుదల చేయాలని భావిస్తున్నారు. సల్మాన్ కి ఈద్ ఒక సెంటిమెంట్‌గా వస్తుంది. కనుక 2027 ఈద్ కి సల్లూ భాయ్ రాక ఖాయం.సల్మాన్ ఖాన్ హీరోగా...సల్మాన్ ఖాన్ గత కొన్ని సంవత్సరాలుగా వరుస ఫెయిల్యూర్స్ ను చవిచూస్తున్నాడు. అయినా కూడా సల్మాన్ ఖాన్ సినిమా ఈద్ కి వస్తుంది అంటే ఖచ్చితంగా అభిమానులతో పాటు హిందీ ప్రేక్షకులు అంతా కూడా ఆసక్తిగా ఎదురు చూస్తారు. దాంతో పోటీగా ఉన్న సినిమాలు సైడ్ కావాల్సి ఉంటుంది. ముఖ్యంగా బాలీవుడ్ యంగ్ హీరోల సినిమాలు సల్మాన్ ఖాన్ ఈద్ కి వస్తున్నాడు అంటే సైడ్ ఇస్తూ ఉంటారు. కానీ ఇప్పుడు ప్రభాస్ స్పిరిట్ సినిమాను ఇప్పటికే ఈద్ కి అనుకున్నారు. కనుక పెద్ద చిక్కు వచ్చి పడిందే అంటూ నిర్మాతలు జుట్టు పీక్కుంటున్నారు. వంశీ పైడిపల్లి మూవీ అంటే కచ్చితంగా ఆలస్యం అయ్యే అవకాశం లేదు. ఆయన అనుకున్న సమయంకు సినిమాను పూర్తి చేసి విడుదలకు ఇస్తాడు. ఇంకా చాలా సమయం ఉంది కనుక సల్మాన్ ఈద్ కి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయిసల్మాన్ ఖాన్ తో ప్రభాస్ పోటీ...ఇక ప్రభాస్ స్పిరిట్ సినిమా విషయానికి వస్తే ఈద్ కి రావాలని బలంగా అనుకుంటున్నప్పటికీ విడుదల వాయిదా పడే అవకాశాలు లేకపోలేదు. దర్శకుడు సందీప్ వంగ ఎంత ప్రయత్నించినా కూడా షూటింగ్‌కు ప్రభాస్ డేట్లు ఇవ్వక పోతే ఆయన ఏం చేయలేడు. కనుక ప్రభాస్ నుంచి స్పిరిట్ సినిమాకు కావాల్సిన రోజులు, కావల్సినప్పుడు డేట్లు ఇస్తే 2027 ఈద్ కి వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఆ పరిస్థితి ఎంత వరకు ఉంది అంటే ప్రశ్నార్థకమే. అందుకే సల్మాన్ ఖాన్ సినిమా ఈద్‌కి వచ్చి, ఆ తర్వాత స్పిరిట్ సినిమాను విడుదల చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలా కాదని దర్శకుడు సందీప్ వంగ షూటింగ్ పూర్తి చేసి ఈద్ కి విడుదల చేస్తే మాత్రం బిగ్ ఫైట్ తప్పదు. సౌత్ ఇండియాలో ప్రభాస్ దుమ్ము దులిపితే, నార్త్ ఇండియాలో సల్మాన్ ఖాన్ వసూళ్లు భారీగా రాబట్టే అవకాశాలు ఉన్నాయి. అయితే చివరకు హిట్ బొమ్మకే లాంగ్ రన్ లో జనాలు పట్టం కడుతారు.

### సుహాస్ ‘మండాడి’..

## పెద్ద పని పూర్తయినట్లే..

టాలీవుడ్ నటుడు సుహాస్, కోలీవుడ్ యాక్టర్ సూరి లీడ్ రోల్స్ తెరకెక్కుతున్న మండాడి చిత్రం షూటింగ్ పూర్తయింది. ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మిస్తున్న ఆ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా మొదటి నుంచే ఆసక్తి క్రియేట్ చేస్తోంది. ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్లతోనే ప్రేక్షకుల్లో మంచి హైప్ తెచ్చుకున్న ఆ సినిమా తీరప్రాంతం, మత్స్యకారుల జీవన నేపథ్యంలో రూపొందుతోంది.రామనాథపురం ప్రాంతంలోని సముద్రతీరాల్లో షూటింగ్ జరగడం విశేషం. దర్శకుడు మదిమారన్ పుగళేంది ఆ చిత్రాన్ని ఎంతో రియలిస్టిక్ గా తెరకెక్కించేందుకు కష్టపడ్డారు. కథకు తగ్గట్టుగా రియల్ లొకేషన్లలో షూటింగ్ నిర్వహించడం వల్ల విజువల్ గా కూడా సినిమాకు ప్రత్యేకత వచినట్లు తెలుస్తోంది. చాలా రోజులుగా సాగిన లాంగ్ షెడ్యూల్ లో తీసిన యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ సీన్స్, ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసే సెయిల్ బోట్ రేస్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయిషూటింగ్ పూర్తవడంతో ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి వెళ్లింది మండాడి మూవీ. ఎడిటింగ్, సౌండ్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీపడకుండా బెస్ట్ అవుట్ పుట్ ను అందించేందుకు టీమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. చిత్రంలో సూరి తన పాత్ర కోసం ఫిజికల్ పరంగా చాలా కష్టపడ్డారని సమాచారంమరోవైపు.. సుహాస్ మండాడి సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఇందులో ఆయన నెగిటివ్ షేడ్స్ ఉన్న విభిన్న పాత్రలో నటిస్తున్నారు. ఆ పాత్ర కోసం ఆయన పూర్తి మేకోవర్ తీసుకోవడమే కాకుండా, దాదాపు 100 రోజుల కాల్ షీట్లను కేటాయించడం ఆయన డెడికేషన్ ను చూపిస్తోంది. హీరోయిన్ గా మహిమా నంబియార్ నటిస్తుండగా, సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.





## రెండవ సారి తల్లి అవుతున్నా తగ్గేదేలే!

నటిగా అంకితభావాన్ని చాటుకోవడంలో దీపికా పదుకొనే ఎప్పుడూ ముందే ఉంటుంది. ఇటీవల రెండోసారి గర్భం దాల్చినట్లు అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా విశ్రాంతి తీసుకోకుండా కెమెరా ముందుకు రావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. షారుఖ్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న –కింగ్– చిత్ర షూటింగ్‌లో దీపిక తాజాగా అడుగుపెట్టింది. గర్భవతి గా ఉన్నా? వృత్తి పట్ల ఆమె చూపిస్తున్న నిబద్ధతను చూసి చిత్ర పరిశ్రమ ప్రశంసల వర్షం కురిపిస్తోంది. ఈ సినిమాలో దీపికా కేవలం అతిథి పాత్రకే పరిమితం కాలేదుఅత్యంత కీలకమైన సాహసోపేతమైన యాక్షన్ సీక్వెన్స్‌లో పాల్గొంటుంది. ముంబైలోని ఓ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో ఆమె ఎనిమిది మంది ఫైటర్లతో తలపడే సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఇసుక నేపథ్యంలో సాగే ఫైట్ సీన్ సినిమాకే హైలైట్‌గా ఉంటుందని సమాచారం. దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ పర్యవేక్షణలో జాగ్రత్తలు తీసుకుంటూనే రిస్కీ షాట్స్‌ను దీపిక పూర్తి చేసింది. దీపిక మొదటి ప్రెగ్నెన్సీ సమయంలోనూ ఇంతే యాక్టివ్‌గా పనిచేసింది. –కల్కి 2898 ఏడీ’ ప్రమోషన్లలో పాల్గొనడమే కాక హై హీల్స్ వేసుకుని ఈవెంట్లకు హాజరై షాక్‌కు గురిచేసిందితాజాగా రెండవ సారి తల్లి కాబోతున్న తరుణంలో కూడా అంతే పట్టుదలతో పని చేస్తోంది. –కింగ్– సినిమాతో పాటు అల్లు అర్జున్ సరసన నటిస్తోన్న –రాకా– షూటింగ్‌లో కూడా పాల్గొంటుంది. ఇందులోనూ దీపిక సాహసోపేతంగా పని చేయాల్సిందే. దర్శకుడు అట్లీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తోన్న చిత్రమిది. భారీ యాక్షన్ థ్రిల్లర్ గా హైలైట్ చేస్తున్న చిత్రమిది. సినిమాలో అల్లు అర్జున్ పాత్ర సినిమాకు ఎంత కీలకమో..హీరోయిన్ గా నటిస్తోన్న దీపిక రోల్ కూడా అంతే కీలకం. దీపిక సైతం భారీ యాక్షన్ సన్నివేశాలు పూర్తి చేయాల్సి ఉంది. ఇంకా దీపిక పూర్తి స్థాయిలో –రాకా– రంగంలోకి దిగలేదు.దీపికా పదుకొణే తీసుకుంటోన్న నిర్ణయాలతోనే సినిమా పట్ల ఉన్న ప్యాషన్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. దీపికా పదుకొణే ఓ వైపు వ్యక్తిగత జీవితంలోని మధుర క్షణాలను ఆస్వాదిస్తూనే మరోవైపు వృత్తిపరమైన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తుంది. అంతే విధిగా సమయం వచ్చిందంటే? పోరాటానికి సైతం రంగంలోకి దిగే స్వభావం గల నటి. ఆ మధ్య వర్కింగ్ హావర్స్ విషయంలో గళాన్ని ఎలా వినిపించిందో తెలిసిందే.



### “పెళ్లి లేకపోయినా ఓకే”

## మాతృత్వంపై నిత్యా మీనన్ ఓపెన్ టాక్

గ్లామర్ కంటే కూడా కంటెంట్ ఉన్న సినిమాలకే ప్రాధాన్యత ఇచ్చే ఈ నేషనల్ అవార్డు విన్నర్, తాజాగా పెళ్లి మరియు మాతృత్వంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.సినీ పరిశ్రమలో తనదైన నటనతో, స్వతంత్ర భావాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నిత్యా మీనన్. గ్లామర్ కంటే కూడా కంటెంట్ ఉన్న సినిమాలకే ప్రాధాన్యత ఇచ్చే ఈ నేషనల్ అవార్డు విన్నర్, తాజాగా పెళ్లి మరియు మాతృత్వంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. సమాజం నిర్ణయించిన కట్టుబాట్ల కంటే వ్యక్తిగత ఇష్టాలే ముఖ్యమని ఆమె చెబుతున్న మాటలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. ఆ వివరాలు చూద్దాం..పెళ్లితో సంబంధం లేని మాతృత్వం:ఇటీవల ఒక ఇంటర్వ్యూలో నిత్యా మీనన్ మాట్లాడుతూ పెళ్లి, పిల్లల విషయంలో చాలా బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. “పిల్లల్ని కనడానికి పెళ్లితో సంబంధం లేదు” అని ఆమె స్పష్టం చేశారు. ఎవరైనా పిల్లలు కావాలని కోరుకుంటే అందుకు వివాహం ఒక్కటే మార్గం కాదని, అది పూర్తిగా ఒక వ్యక్తి వ్యక్తిగత నిర్ణయమని ఆమె అభిప్రాయపడ్డారు. పెళ్లికి ముందు లేదా తర్వాత అనే దానికంటే, ఒక ప్రాణానికి జన్మనివ్వాలనే కోరికకు సామాజిక హోదాతో ముడిపెట్టాల్సిన అవసరం లేదని నిత్యా వెల్లడించడం చర్చనీయాంశమైంది.స్వేచ్ఛే నా ప్రాణం:ప్రస్తుతం 37 ఏళ్ల వయసులో ఉన్న నిత్యా మీనన్, తన సోలో లైఫ్‌ను పూర్తిస్థాయిలో ఎంజాయ్ చేస్తున్నారు. పెళ్లి విషయంలో తనపై ఇంట్లో ఎటువంటి ఒత్తిడి లేదని ఆమె చెప్పారు. “నేను ఇప్పుడు ఒక మంచి పొజిషన్‌లో ఉన్నాను. నాకు ఏం కావాలో నాకే తెలుసు. నా తల్లిదండ్రులు కూడా నన్ను అర్థం చేసుకుని నాకు కావాల్సిన స్వేచ్ఛను ఇచ్చారు” అని తెలిపారు. తన అమ్మమ్మ ఉన్నప్పుడు పెళ్లి గురించి అడిగేవారని, కానీ ఇప్పుడు ఆమె లేరని, ఆ తర్వాత తనను ఎవరూ ఇబ్బంది పెట్టలేదని నిత్యా గుర్తు చేసుకున్నారుపెళ్లి అనేది జీవితంలో ఒక భాగం మాత్రమేనిత్యా దృష్టిలో పెళ్లి అనేది జీవితానికి ఆఖరి లక్ష్యం కాదు. అది కేవలం మన ప్రయాణంలో ఒక భాగం మాత్రమే. “పెళ్లి జరిగితే మంచిదే, కానీ జరగకపోయినా జీవితం ఆగిపోదు. ఎంతో మంది ఒంటరిగానే ఉండి ప్రపంచంలో గొప్ప విజయాలు సాధించారు” అని ఆమె చెప్పుకొచ్చారు. మనిషి జీవితంలో చివరికి మిగిలేది సంతోషం మాత్రమేనని, ఆ సంతోషం పెళ్లి వల్ల వస్తుందని గ్యారెంటీ లేదని ఆమె కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. అందుకే నిజమైన తోడు దొరికినప్పుడే పెళ్లి గురించి ఆలోచిస్తానని ఆమె స్పష్టం చేశారుకెరీర్‌లో దూసుకుపోతున్న నిత్య:వ్యక్తిగత అభిప్రాయాల విషయంలో ఎంత కచ్చితంగా ఉంటారో, కెరీర్ విషయంలోనూ నిత్యా అంతే క్లారిటీతో ఉంటారు. వరుస సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉండటమే కాకుండా, ఇటీవల ‘తిరుచిత్రంబలం’ సినిమాకు జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఇక భాషతో సంబంధం లేకుండా సౌత్ ఇండియాలోని అన్ని పరిశ్రమల్లో తనకంటూ ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్న నిత్యా, తన వ్యక్తిగత నిర్ణయాలతో కూడా నేటి తరం మహిళలకు ఒక సరికొత్త స్ఫూర్తిని ఇస్తున్నారు.నిత్యా మీనన్ చేసిన ఈ వ్యాఖ్యలు సమాజంలో ఉన్న కొన్ని పాత ఆలోచనలను ప్రశ్నించేలా ఉన్నాయి. పెళ్లి, పిల్లలు అనేవి వ్యక్తిగత నిర్ణయాలని, వాటిని ఇతరుల కోసం కాకుండా మన సంతోషం కోసం తీసుకోవాలని ఆమె చెప్పిన తీరు ఆకట్టుకుంటోంది. ఇక ఏదేమైనా, తన మనసులోని మాటను మొహమాటం లేకుండా చెప్పే నిత్యా మీనన్ నిజంగానే ‘స్పెషల్’ అనిపిస్తోంది. ఆమె తన కెరీర్‌లో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం.

## బుచ్చిబాబు స్ట్రాటజీకి చరణ్ డెడికేషన్ తోడైతే..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో రూపొందుతున్న పెద్ది చిత్రంపై అనౌన్స్మెంట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ఆ ప్రాజెక్టు గురించి ఇండస్ట్రీలో వినిపిస్తున్న మాట ఒకటే.. ‘బుచ్చిబాబు స్ట్రాటజీకి చరణ్ డెడికేషన్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ అవ్వడం ఖాయం’ అన్నదే.నిజానికి ఉప్పెనతోనే వంద కోట్ల క్లబ్ లో చేరిన బుచ్చిబాబుకు ఇది రెండో చిత్రం. రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోతో అవకాశం రావడం విశేషం. ఆ అవకాశాన్ని యూజ్ చేసుకోవాలనే లక్ష్యంతో దర్శకుడు ఎంతో జాగ్రత్తగా ముందుకెళ్తున్నట్లు సమాచారం. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలు కొన్నేళ్ల పాటు నిర్మాణ దశలో ఉండటం చూస్తుంటాంఅయితే పెద్ది మాత్రం దాదాపు ఏడాది కాలంలోనే షూటింగ్ పూర్తి దశకు చేరుకోవడం విశేషం. చిత్రీకరణ లాస్ట్ లో ఉన్నప్పటికీ, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగిస్తున్నారు. రెండు సార్లు విడుదల వాయిదా పడినా, సినిమాపై ఎలాంటి నెగిటివ్ టాక్ రాకుండా దర్శకుడు ప్లానింగ్ మాత్రం సూపర్.



EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022